క్లుప్తంగా

ఎస్ఐగా సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ



హుకుంపేట: హుకుంపేట ఎస్ఐగా ఏ.సత్యనారయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేసిన ఎస్ఐ సురేష్ పాడేరుకు బదిలీ అయ్యారు. పాడేరు నుంచి సూర్యనారాయణ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పూర్ణిమ

హుకుంపేట: గ్రామాల్లో గిరిజనులు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ అన్నారు. మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో జరిగే ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా ఆర్థికాభివృద్ధితో పాటు భూమి చదును, చెరువులు, కాలువల వంటి పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు లింక్‌లు, ఆధార్ అప్‌డేట్ తదితర సాంకేతిక సమస్యల వలన కూలీలకు వేతనలు అందడం లేదన్నారు. నాయకులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



ఏవో ఉమాదేవి

కొయ్యూరు: కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలను అందజేస్తున్నట్టు ఏవో ఉమాదేవి తెలిపారు. గ్రూపు ద్వారానే వారికి రుణాలు వస్తాయని సోమవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇస్తామన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కౌలు రైతులను గుర్తిస్తాయన్నారు. ముందుగా కౌలు రైతుల వివరాలను, పట్టా కలిగిన రైతుల వివరాలను పరిశీలించి జాబితా తయారు చేస్తారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి ఆమోదం అయిన తదుపరి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తారన్నారు. ఈ కార్డుల కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. ప్రతీ యేడాది తొలకరిలో వాటిని ఇస్తామన్నారు. అర ఎకరానికి పైబడి సాగు చేసే రైతులు దీనికి అర్హులుగా పేర్కొన్నారు. రైతులకు రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను అందజేస్తామన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి



కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న శాంతకుమారి

అరకులోయటౌన్: మండల కేంద్రం అరకులోయలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ సోమవారం పర్యటించారు. ఆయనకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంత కుమారి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వల్లే దేశంలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. నాయకుడు బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



దోమలమందు పిచికారీని పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి కన్నబాబు

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ సచివాలయం పరిధిలో దోమల మందు పిచికారీని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.కన్నబాబు సోమవారం పరిశీలించారు. దోమల నివారణకు వీలుగా ఏసీఎం ఐదు శాతం మందును పిచికారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల మందును ఇంటి లోపల, బయటా పిచికారీ చేయించుకోవాలన్నారు. పిచికారి చేసిన గోడలకు పేడ లేదా మట్టితో అలకవద్దని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలు రావన్నారు. హెల్త్ సహాయకులు రాజేష్ తదితరులున్నారు.

భూగర్భ జలం.. ఇంకిస్తేనే ఫలం

- గ్రామాల్లో రాతికట్టు, చెరువుల నిర్మాణం
- ఉపాధి హామీ పథకం ద్వారా పనులు
- నీటి సంరక్షణపై రైతులకు అవగాహన



చెరువు నిర్మాణ పనులు

కొయ్యూరు: నీరు నిల్వ ఉన్నచోటే భూగర్భ జలాలు పెరుగుతాయి. అలా కాకుంటే అవి తగ్గుతాయి. విచ్చలవిడిగా బోర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలు లేదా వ్యవసాయం కోసం నీటిని తోడడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మండుతెన్న ఎండలతోనూ భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో తాగునీరు, సాగునీటి కోసం గిరిజనులు అల్లాడిపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విస్తృతంగా చెరువుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వర్షపునీరు వృథా కాకుండా చిన్న చిన్న చెరువులు, ఫారంపాండ్లు, రాతికట్లు నిర్మాణ పనులు జరిగాయి. ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసింది. భూగర్భ జలాలను సంరక్షించడం, ఖనిజా లవణాలు నిక్షిప్తం చేసేందుకు చెరవులు, రాతికట్టలు, ఫారంపాండులఎంతగానో దోహదపడతాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ మేరకు దీనిపై గిరిజనులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరముందని చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రాతికట్టలు, ఫారంపాండ్లు, చెరువుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

వృథా నీటికి అడ్డుకట్ట..రాతికట్ట

భూగర్భ జలాలు పరిరక్షించుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెరువులు, రాతికట్ల నిర్మాణం జరిగింది. దీంతో చెరువులు, గుంతలు, ఫారంపాండ్లలో సంవృద్ధిగా నీటితో సత్ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుతం వాటర్‌షెడ్ పథకం ద్వారా మండలంలోని మంప, రేవళ్లు, మర్రివాడ, కొయ్యూరు, రావణాపల్లి తదితర ప్రాంతాల్లో రాతికట్టలు, ఫారంపాండ్ల పనులు జరుగుతున్నాయి. నీటి నిల్వ ఉంచేందుకు 100 మీటర్ల పొడవుగల 25 పెద్ద చెరువులు, 90 మీటర్ల గల 20 చిన్న చెరువులు, 20 ఫారంపాండ్లు ఏర్పాటు చేశారు. కొండలపై నుంచి వచ్చే నీరు వృథాగా పోతుంది. దీనిలో కొంత వరకైనా ఒడిసిపట్టి చెరువులలో నిల్వ ఉంచడం ద్వారా భూగర్భ జలాలను పెంచుతున్నారు. కొండలపై నుంచి వర్షపునీరు పారుతున్నప్పుడు భూమిలో ఉన్న విలువైన లవణాలు, ఒండ్రుమట్టి సైతం కొట్టుకుపోతోంది. ఫలితంగా భూసారం దెబ్బతింటుంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు రాతికట్ట ఎంతో ఉపయోగపడుతుంది. రాతికట్టలో వర్షపునీటితో పాటు భూ ఖనిజాలు, లవణాలు వృథాగా పోకుండా ఉంటాయి. ఫారం పాండ్ల ద్వారా రైతుల పొలాల్లో సైతం నీటిని నిల్వ ఉంచుకోవచ్చు. వర్షపునీరు వృథాగా కాకుండా నిర్మించిన చెరువుల్లో రైతులు చేపల పెంపకం చేయవచ్చు. ఆయా చెరువు గట్లపై కూరగాయల సాగు చేసుకోవచ్చు. ఫలితంగా రైతులు మరింత ఆర్థికాభివృద్ధి పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



నిర్మాణంలో ఉన్న రాతికట్టు

అవగాహన పెంచాలి

నీరువృథా కాకుండా గిరిజనులకు అధికారులు అవగాహన కల్పించాలి. ఇందులో భాగంగా పొలాల్లో రాతికట్టల నిర్మాణం, ఫారంపాండ్లు వంటివి నిర్మించుకునేలా చూడాలి. నీటి నిల్వ ఉండడంతో సాగునీటికి ఇబ్బందులు ఉండవు. వర్షపునీరు సంవృద్ధిగా ఉండడంతో వ్యవసాయ పనులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అధికారులు స్పందించాలి.

– రమణబాబు, మంప

కొనసాగుతున్న పనులు



ఇప్పటి వరకు మండలంలో ఎంపిక చేసిన ఐదు పంచాయతీల్లో రూ.రెండు కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. రైతులకు ఉపయోగపడే పెద్ద, చిన్నచెరువులను నిర్మించాం. కొండలపై నుంచి వచ్చే నీరు నిల్వ ఉండేందుకు అవి ఎంతగానో ఉపయోపడతాయి. ఆయా చెరువుల్లో రైతులు చేపల పెంపకం చేపట్టి కొంతమేర ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. వాటర్‌షెడ్ పథకం ద్వారా గ్రామాల్లో చెరువుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– శంకర్‌రావు, వాటర్ షెడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్, కొయ్యూరు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

ఎటపాక: బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ సూచించారు. ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న 163 మందికి 90 రోజులపాటు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు ఒక బ్యాచ్‌కు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండవ బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందని తెలిపారు. కనీసం 75 రోజులు శిక్షణకు హాజరైన వారికి ఉచితంగా కుట్టుమిషన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్పొరేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ బీరా సునీల్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ అనంతబాబు జన్మదిన వేడుకలు



అనంతబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ రామారావు, పీసా కమిటీ అధ్యక్షుడు జయరాజ్

వి.ఆర్.పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ చింతరేగిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ అనంత బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పిట్టా రామారావు, పీసా కమిటీ అధ్యక్షుడు కోటం జయరాజ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఫోన్‌లో ఎమ్మెల్సీ అనంత బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. గుటాల ముత్యాలరావు, కోట్ల సాయిరామ్, గుటాల నవీన్ కుమార్, గుటాల వెంకటేశ్వర్లు, సీతయ్య, కోటం రాజు ముత్యాల అశోక్, గుటాల నాగేశ్వరావు, మడివి దుర్గారావు, కత్తి రాజులు, ఆకుల బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా హైవే పనులు



హైవేపై సైన్‌బోర్డు

రాజవొమ్మంగి: అల్లూరి జిల్లా రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, చింతపల్లి, పాడేరు గ్రామాల మీదుగా అరకు వరకు జాతీయరహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారిపై రేడియం స్టిక్కర్లతో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. దీంతోపాటు వివిధ మండలాల పేర్లు, కిలోమీటర్లను సూచిస్తూ ఏర్పాటుచేసిన పెద్ద సైనింగ్ బోర్డులు ఆకట్టుకుంటున్నాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు సుమారు 406 కిలోమీటర్ల పొడవున ఎన్‌హెచ్–516ఈ గ్రీన్ హైవే నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. విశాలమైన జాతీయ రహదారి మన్య ప్రాంతాలకు కొత్త అందాన్ని తీసుకొచ్చిందని పలువురు చెబుతున్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి



వి.ఆర్.పురం సభలో మాట్లాడుతున్న నేతలు



చింతపల్లిలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నేత చిన్నయ్యపడాల్ తదితరులు

ఎటపాక: సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఎటపాకలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఐ.వి. మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తితో ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతానికి ముందుకు పాగాలని పిలుపునిచ్చారు. బాలకృష్ణ, నాగేశ్వరరావు, అర్జున్‌దొర, పద్మ, భద్రయ్య, హుస్సేన్, హరి,రాము,అజయ్ తదితరులున్నారు.

చింతపల్లి: సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సుందరయ్య అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సుందరయ్య ఆశయ స్థానకు అందరూ కృషి చేయాలని కోరారు. మన్యంలో ఖనిజ సంపాదనను దోచుకునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీనిపై గిరిజనులంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణ, అప్పలనర్స, సత్యవతి, భవాని, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వి.ఆర్.పురం: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సుందరయ్య అడుగుజాడల్లో నడవాలన్నారు. ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ప్రదీప్‌కుమార్, సర్పంచ్ కారం బుచ్చమ్మ, నాయకులు చినబాబు, సత్తిబాబు, సుందయ్య, రమేష్, సత్యనారాయణ, తాతబాబు, శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, కాంతారావు, రాజు, ప్రకాష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు.. తాగునీటికి ఇక్కట్లు

- జాజిపాలెంలో నిలిచిన నీటి సరఫరా
- పనిచేయని బోర్లు
- నాలుగు రోజులుగా స్థానికుల అవస్థలు
- అంధకారంలో గ్రామం
- పట్టించుకోని అధికారులు



తుప్పల మధ్యలో ఉన్న తాగునీటి సరఫరా మోటార్ గది



నిరుపయోగంగా తాగునీటి బోరు

అడ్డతీగల: విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల ఆ గ్రామం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. తాగునీటి సరఫరా లేక స్థానికులు అల్లాడిపోతున్నారు. ఓ వైపు మండుటెండ..మరోవైపు విద్యుత్ కోతతో గ్రామస్తులు సతమతమవుతున్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గ్రామంలో సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండంలోని జాజిపాలెంలో నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. దీంతో మోటార్లు పనిచేయక తాగునీరు సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో చేతిబోర్లు మూలకు చేరగా, ఉన్న చేతిబోరు నుంచి అరకొరగా నీరు వస్తుందని, గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక మహిళలు వాపోతున్నారు. గెడ్డల నుంచి నీరు తెచ్చుకొని వినియోగిస్తున్నామని, చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, తాగునీటి సరఫరా అయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రామంలో నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాగునీటి పథకం నుంచి నీటి సరఫరా జరగడం లేదు. చేతిబోరు పనిచేయడం లేదు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలను ఆశ్రయించి గత్యంతరం లేక కలుషిత నీటిని వినియోగిస్తున్నారు. చీకటి పడితేగ్రామస్తుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అంధకారం అలముకుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– కోనా గణేష్, మండల కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం, జాజిపాలెం

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



జి.మాడుగులలో పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో బాబూరావు పడాల్

జి.మాడుగుల: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు సెంటర్‌లలో జరిగిన తొలి పరీక్షకు 84 మందికి గాను 73 మంది హాజరైనట్టు ఎంఈవో బాబూరావు పడాల తెలిపారు. ఇందులో భాగంగా గురుకుల పాఠశాలలో జరిగిన పరీక్షకు 34 మందికి గాను 30 మంది విద్యార్థులు, జి.ఎం.కొత్తూరు సెంటర్‌లో 20 మందికి 15 మంది విద్యార్థులు, గాంధీనగరంలోని పరీక్ష కేంద్రంలో 30 మందికి 28 మంది విద్యార్థులు హాజరైనట్టు పేర్కొన్నారు.



అడ్డతీగలలో పరీక్షకు హాజరైన విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

అడ్డతీగల: పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు సోమవారం మొదటిరోజు 78 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. 84 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హజరైనట్టు పేర్కొన్నారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం, వై.రామవరం మండలాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

డుంబ్రిగుడ: ప్రజా సమస్యల పరిష్కారమే మీ కోసం కార్యక్రమం ఉద్దేశమని ఎంపీడీవో ప్రేమ్ సాగర్ అన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మీకోసం ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు చేసుకొవచ్చన్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

చీడికాడ : ప్రకృతి వ్యవసాయం సాగు దిశగా రైతులు ముందుకెళ్లాలని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనువాసరావు అన్నారు. సోమవారం మండలంలోని ఖండివరంలో కేపీపీ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వృద్ధి చేయడానికి పీఎండీఎస్ కిట్స్ పొలంలో వేయడం ప్రధానమన్నారు. ఉత్తమ రైతులు దొకల అప్పలనాయుడు, రైతులు గుల్లిపల్లి వరహాలమూర్తి సుంకర వెంకటలక్ష్మి, తంగేటి నారాయణమ్మ తమ సాగు అనుభవాలను రైతులకు వివరించారు. చెరకులో జంటసాల్లు, వరి, అపరాల సాగు మేలు చేస్తుందని తెలిపారు. ఎంటీఎల్ సంగీత రెడ్డి, డీఎంఎంటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదబయలు టీడీపీలో వర్గపోరు

మండల పార్టీ ఎన్నిక రద్దు చేయాలని డిమాండ్



సమావేశంలో నాయకులు

పెదబయలు: పెదబయలు మండలంలో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. మండల పార్టీ అధ్యక్షుడి ప్రమేయం లేకుండా ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికి పార్టీలో అధ్యక్ష, కీలక పదవులు ఎలా ఇస్తారని మండల పార్టీ మాజీ అధ్యక్షురాలు సీకరి సుకుమారి, అనుబంధ సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

పెదబయలులో టీడీపీ నేతల సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, సర్పంచ్‌లు,ఎంపిటీసీలు,ఇతర సీనియర్ నాయకుల అభిప్రాయం లేకుండా ఈ నెల 13న మండల పార్టీ అధ్యక్షుడిగా వెచ్చంగి కొండయ్య, ఇతర పార్టీకి నుంచి వచ్చిన కొర్రా రాజారావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేసి పార్టీ అధిష్టానికి పంపడం దారుణని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పార్టీ నిబంధనల ప్రకారం పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు అధ్యక్ష, కార్యదర్శులు మండల బాడీ ఎన్నిక జరగాలన్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలందిస్తున్న వారిని పక్కనపెట్టి, వేరే పార్టీల నుంచి వలస వచ్చిన వారికి పదవులు ఇవ్వడం పార్టీ సీనియర్లకు అవమానపరచడమేనన్నారు.

తక్షణమే ప్రస్తుత మండల పార్టీ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపిపి సోనె, నాయకులు నాగేశ్వర రావు, త్రినాథ్, భూషణ్‌రావు, రవికుమార్, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.